


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## పిచ్చి మొద్దు

**"నీలూ కరెంట్ బిల్ వచ్చిందా?" ఫైల్స్ సర్దుకుంటూ** అడిగాడు శివాజీ.

"వచ్చింది. ఫోన్ బిల్ దగ్గరే పెట్టాను" వంట గదిలో ఉన్న సునీత జవాబు చెప్పింది.

"త్వరగా వచ్చి ఇవ్వు. ఈ సేవలో ఆ రెండు బిల్స్ కట్టి ఆఫీస్‌కి వెళ్ళాలి. లేటవుతుంది" అరిచాడు.

చేతులు కడుక్కుని గబగబా వచ్చి రెండు బిల్స్ అతని చేతికి అందిస్తూ తటపటాయిస్తూ అడిగింది.

"పోనీ నేను కట్టిరానా, నా పనయ్యాక?"

"నువ్వా?" ఆమెని ఎగాదిగా చూసి చెప్పాడు.

"వద్దులే. నేను కడతాను."

ఆమెని తప్పుకుంటూ బయటకి వెళ్ళిపోయాడు.

దీర్ఘంగా నిట్టూర్చింది సునీత.

శివాజీకి సునీత మీద తగని అనుమానం. ఆమెని ఏ మాత్రం నమ్మడు. అది సునీతకి చాలా బాధాకరంగా ఉంటుంది. కానీ ఏమీ చేయలేని నిస్సహాయత.

అనుమానం అంటే సునీత శీలం మీద అనుమానం కాదు. స్వతహా మంచివాడైన శివాజీకి అసలు అలాంటి ఊహలు కూడా రావు. అతని అనుమానం, అపనమ్మకం అంతా ఆమె సమర్థత మీదే. సునీతకి బయటి వ్యవహారాలు ఏవీ తెలియవని, ఆమెని చాలా తేలిగ్గా మోసగించచ్చని, డబ్బు సరిగ్గా లెక్కపెట్టడం కూడా రాని అవివేకి అని శివాజి దృఢంగా నమ్ముతాడు. అందుకే బయటి వ్యవహారాలు ఏవీ నమ్మి ఆమెకి అప్పగించడు. ఇంటి పనుల్లో కూడా ఆమె అసమర్థతని ఎత్తి చూపుతూనే ఉంటాడు. ఈ పరిస్థితి

సునీతకి దుర్భరంగా ఉన్నా మంచివాడైన అతనిలో ఈ ఒక్క చెడ్డ గుణమే కదా సర్దుకుపోదాం అనుకుంటుంది. పెళ్ళయ్యాక మొదటి రాత్రే సునీత తటపటాయిస్తూ శివాజీని అడిగింది.

"మన పెళ్ళికి ముందు నేను మా ఊళ్ళో ఉద్యోగం చేసేదాన్ని కదా. మీరు జాబ్ చేసే ఊళ్ళో మా బ్రాంచ్ లేక మానేశాను. వేరే ఏదైనా కొత్త ఉద్యోగం చూసుకోనా?"

"వద్దు. నాకు వచ్చే జీతం మనిద్దరికీ హాయిగా సరిపోతుంది. ఏడాదికోసారి పొలం మీద వచ్చే పంట డబ్బులతో నగలు చేయించుకుందువు గాని" చెప్పాడు శివాజీ ఉదారంగా.

"కానీ ఇంత చదువు చదువుకుని..." నసిగింది సునీత.

"ఈ ప్రస్థావన ఇంకెప్పుడూ తేవద్దు" కోపంగా అటు తిరిగి పడుకున్నాడు శివాజీ.

కొత్తగా పెళ్ళయినా, ఆ సరసం కూడా అతను అంత కఠినంగా చెప్పేసరికి అతని నిర్ణయం మారదని అర్థమైన సునీత ఇక ఆ విషయం మర్చిపోయింది. సూపర్ బజార్ నుంచి తెచ్చిన ఉప్పు పప్పులని డబ్బాల్లోకి పోసి సర్దిపెట్టుకోవడం, కొత్త కొత్త వంటల ప్రయోగాలు చేయడం, తీరిక సమయాల్లో టీ.వీ చూడటం ఇలా కొత్త వ్యాపకాలలో పడిపోయి 'గృహమే కదా స్వర్గసీమ' అనే స్థితిలోకి వచ్చింది.

కానీ అప్పుడప్పుడూ ఇంటా, బయటా శివాజీ ఒక్కడే అన్ని పనులూ చూసుకుంటూ సతమతమవుతూంటే 'అయ్యోపాపం' అనిపించి, వాటిని పంచుకుంటా అని చెప్పినా శివాజీ ఒప్పుకోడు.

"నువ్వొట్టి పిచ్చి మొద్దువి నీలూ. నువ్వు బిల్లులు కడితే రసీదు కూడా అడగవు. వాడు ఎంచక్కా ఆ డబ్బుని జేబులో వేసుకుని బిల్లు కట్టలేదని రిమైండర్స్ పంపిస్తాడు. హాయిగా టీవీ చూసుకోరాదు.ఈ గోల నీకెందుకు?" సముదాయిస్తాడు.

"మరీ అంత పిచ్చిమొద్దులా కనిపిస్తున్నానా? నేను యం.ఎస్సీ చదివి కొంతకాలం జాబ్ కూడా చేసాను తెలుసా?" ఉక్రోషంగా చెప్తుంది.

అతను చాక్లెట్ కోసం మారాం చేసే చిన్న పిల్లని చూసినట్టుగా ఆమె వంక చూసి వెళ్ళిపోయేవాడు.

ఇలా రెండు వారాలకోసారి ఈ సన్నివేశం వారింట్లో జరుగుతూనే ఉంటుంది. ఎప్పుడూ విజేత శివాజీనే.

●●●

"నీలూ. నిన్నటి ఈనాడు పేపర్ ఓసారి ఇస్తావా? మా ఆఫీస్‌కి సంబంధించిన వార్త ఏదో వచ్చిందిట."

ఆఫీస్ నుంచి రాగానే రిలాక్స్ అవుతూ అడిగాడు శివాజీ.

సునీత మౌనంగా పేపర్ చేతికి అందించింది.

"నిన్నటిదే కదా? నిన్న డేటేంటి? పధ్నాలుగు కదా. ఓకే పధ్నాలుగే. ఆరో పేజీలో వచ్చిందట న్యూస్." పేపర్ తిరగేస్తూ చెప్పాడు.

"అంటే? నిన్నటి పేపర్ ఇవ్వడం కూడా రాదా నాకు?" ఖస్సుమంది.

"ఏమో? ఇవాల్టిదో, మొన్నటిదో ఇచ్చావనుకో. అనవసరంగా ఆరోపేజీ అంతా చదివి, అప్పుడు పొరపాటు తెలుసుకోవాలి. ఈ గోలంతా ఎందుకని ముందు జాగ్రత్తగా తేదీ చూసా. అందులో తప్పేంటి?"

"తప్పా? తప్పున్నరా? డేట్ ప్రకారం పేపర్ కూడా ఇవ్వలేనంత పిచ్చిమొద్దులా కనిపిస్తున్నానా? అది ఎంత అవమానమో తెలుసా?" కోపంగా అరిచి లోపలికి వెళ్ళిపోయింది.

శివాజీ నిర్వికారంగా పేపర్లోని ఆరో పేజీ చదువుతూ చెప్పాడు.

"పిచ్చి మొద్దునా? అని నీకు నువ్వే అనుకుంటున్నావు అంటే నిజంగా పిచ్చిమొద్దువే. ఈ మధ్య ఎందుకు ప్రతీదానికి వాదిస్తున్నావు? హాయిగా 'కాలుమీద కాలు వేసుకుని కుర్చో తల్లి కష్టాలన్నీ నేను పడతాను' అంటే వ్యక్తిత్వం, గుర్తింపు అని పుస్తకాల భాష మాట్లాడతావేంటి? పూర్వ జన్మలో ఏం పుణ్యం చేసావో ఏమో ఎంత ప్రేమగా చూసే భర్త దొరికాడు నీకు?"

"అవును. ఎదుటి మనిషి మీద నమ్మకం లేని భర్త. ఎన్ని పూలతో పూజ చేస్తే దొరుకుతాడు?" లోపలనుంచి కసిగా అరిచింది.

శివాజీ చిన్నగా చిరునవ్వు నవ్వి పేపర్లో మునిగిపోయాడు.

●●●

"నీలూ ఆఫీస్‌కి వెళ్తున్నా. సాయంత్రం సూపర్ మార్కెట్ నుంచి తేవాల్సినవి ఏమైనా ఉన్నాయా?" చెప్పులు వేసుకుంటూ అడిగాడు శివాజీ.

"ఏమీ ఒద్దు. వర్షంగా ఉంది జాగ్రత్త" చెప్పింది సునీత.

"సరే తలుపు వేసుకో. నేను వెళ్తున్నాను."

ఆమె తలుపు లోపలినుంచి బోల్ట్ వేసుకున్నాక కదిలాడు శివాజీ. సునీత తలుపు బోల్ట్ సరిగ్గా వేసుకోదేమో, సేల్స్ పర్సన్స్ అంటూ వచ్చేవాళ్ళు ఇంట్లోకి చొరబడి దొంగతనం చేస్తారేమో అనే అనుమానంతో శివాజీ రోజూ ఆమె తలుపు లోపలనుంచి వేసుకున్నాక, ఓసారి నెట్టి తృప్తిగా వెళ్తాడు ఆఫీస్‌కి.

రెండు మెట్లు దిగగానే వర్షంతో తడిసిన మూడో మెట్టుమీద కాలు జారి ఏమవుతోందో తెలియకుండానే ఎగిరి కిందపడ్డాడు శివాజీ. మెట్లమీద దొర్లి పోయినట్లు తెలుస్తోంది కానీ ఆ తర్వాత అతనికి స్పృహ తప్పింది.

●●●

నెమ్మదిగా కళ్ళు విప్పాడు శివాజీ. తలంతా విపరీతమైన నొప్పిగా ఉంది.

"అమ్మా" మూలిగాడు.

పక్కనే కుర్చీలో కూర్చుని పుస్తకం చదువుకుంటున్న నర్స్ అతని మీదకి వంగి చెప్పింది.

"అమ్మయ్య లేచారా? ఒక్కనిమిషం. డాక్టర్ గారిని పిలిస్తాను. దాదాపు ఏభై ఏళ్ళున్న డాక్టర్ హడావిడిగా వచ్చాడు. శివాజీని చూడగానే ఆనందంగా నవ్వి చెప్పాడు.

"భేష్! మొత్తానికి మెలుకువ వచ్చింది. నాకో చిన్న అనుమానం మిగిలిపోయింది. మీ పేరేంటో చెప్పగలరా?"

"శివాజీ."

"థాంక్ గాడ్ మీ తల బానే పనిచేస్తోంది" ఆయన తృప్తిగా చెప్పాడు.

నెమ్మదిగా తల తడుముకున్నాడు శివాజీ. కట్టు కట్టి ఉంది.

"అరెరె. కదిలించకండి. ఎంత పెద్ద దెబ్బ తగిలిందో తెలుసా? మెట్ల మీద మరచెంబులా దొర్లిపోయారుట. తలంతా క్రాక్సే. ఒక్క అరగంట ఆలస్యంగా మీరు హాస్పిటల్‌కి వస్తే, పిచ్చెక్కడమో, ప్రాణం పోవడమో ఖాయంగా జరిగేది. "హెడ్ ఇంజురీ అంటే సాధ్యమైనంత త్వరగా హాస్పిటల్‌లో చేర్చాలి" అని మీ ఆవిడ చిన్నప్పుడు చదువుకుందిట. అందుకని పాపం ఆగమేఘాల మీద మిమ్మల్ని తీసుకొచ్చింది." మెచ్చుకోలుగా చెప్పాడు డాక్టర్.

"అవును. సునీత ఏదీ?"

తనకి అంత ప్రమాదం జరిగినా ఆమె పక్కన లేకపోవడం శివాజీని బాధించింది.

"వచ్చేస్తారు. పోలీస్ స్టేషన్‌కి వెళ్ళారు" నర్స్ చెప్పింది.

"పోలీస్ స్టేషన్‌కా? ఎందుకు?" సంభ్రమంగా ప్రశ్నించాడు.

"ఏమండీ. మెలుకువ వచ్చిందా? నొప్పిగా ఉందా?"

అప్పుడే లోపలికి వచ్చిన సునీత ఒక్క పరుగున అతని మంచం దగ్గరకి వచ్చి అడిగింది ఓదార్పుగా.

ఆ పరామర్శకి అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"నువ్వు తలుపేసుకుని లోపలికి వెళ్ళావు కదా? నేను పడ్డానని ఎలా తెలిసింది?" బలహీనంగా ప్రశ్నించాడు.

"నేను రెండడుగులు లోపలికి వేయగానే దబ్బుమని శబ్దం వచ్చింది. ఏమైందా అని తలుపు తీసి చూస్తే మీరు మెట్లమీంచి కిందకి పడిపోతున్నారు. ఆ శబ్దానికి వాచ్‌మేన్ కూడా వచ్చాడు. ఇద్దరం సాయంపట్టి మిమ్మల్ని కారులో పడుకోపెట్టి ఇక్కడికి తీసుకొచ్చాం. లక్కీగా మీరు కారు కీస్‌ని వదిలి పెట్టలేదు. వెదికే అవసరం లేకుండా కీ చెయిన్ మీ వేళ్ళకే ఉంది."

"వాచ్‌మేన్‌కి డ్రైవింగ్ వచ్చా?"

"ఊహూ. రాదు. కానీ నాకు వచ్చుగా? కారుని అంబులెన్స్‌లా నడిపి హాస్పటల్‌కి తీసుకొచ్చాను" నవ్వింది.

"నీకు కారు డ్రైవింగ్ కూడా వచ్చా? నాకెప్పుడూ చెప్పలేదే?" విస్మయంగా అడిగాడు.

"చెప్పినా మీరు నమ్మి డ్రైవింగ్ సీట్ ఇస్తారా? నేను కొంతకాలం మా ఊళ్ళో జాబ్ చేసాను కదా? కార్లోనే వెళ్ళేదాన్ని ఆఫీస్‌కి."

"ఓ! మరి పోలీస్ స్టేషన్‌కి ఎందుకు వెళ్ళావు? కొంపతీసి మెట్లు తడిసేలా ఇల్లు కట్టాడని మన బిల్డర్ మీద కేస్ వేయడానికి వెళ్ళలేదు కదా?" సంభాషణ మార్చడానికి అడిగాడు శివాజీ.

"మన కారుని అంబులెన్స్ లాగా నడిపానని చెప్పాగా? అంటే సిగ్నల్స్ దగ్గర ఆగకుండా, ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా, ఒన్ వేలో ఎదురుగా డ్రైవ్ చేసానన్నమాట. మీ తల నుంచి రక్తం కారిపోతుంది. మీరేమో స్పృహలో లేరు. నాకు భయం వేసి, ఏదైతే అదైందని ఫుల్ స్పీడ్‌లో తీసుకొచ్చాను. ట్రాఫిక్ పోలీసులు అందరూ నా వెనకపడ్డారు. డాక్టరుగారికి మిమ్మల్ని అప్పగించి, ట్రాఫిక్ స్టేషన్‌కి వెళ్ళాను. తీరా చూస్తే అక్కడి సి.ఐ ఎన్.సి.సిలో నా బేచ్ మేటే"

"ఏంటీ? నువ్వు ఎన్.సి.సీలో కూడా ఉన్నావా?"

"ఆహాఁ. ఫుల్ ఏక్టివ్. ఓసారి రిపబ్లిక్ డే పెరేడ్‌కి ఢిల్లీకి కూడా వెళ్ళాను. రైఫిల్ షూటింగ్‌లో నాకే ఫస్ట్."

"నీకు షూటింగ్ కూడా వచ్చా?" బలహీనంగా అడిగాడు శివాజీ.

"ఆలిండియా ఫస్ట్. ఇంతకీ సి.ఐ నా బేచ్‌మేట్ అని చెప్పానా, మీ ప్రమాదం గురించి అతనికి చెప్పి 'సారీ' చెప్పాను. ఐదువందలు పెనాల్టీ కట్టి వెళ్ళమన్నాడు. కట్టేసి వస్తున్నా."

శివాజీకి అర్థం కాలేదు.

"తలనొప్పిగా ఉందా? మౌనంగా ఉన్నారేంటి? నేను మీ ఆఫీస్‌కి ఫోన్ చేసి మీ మేనేజర్‌కి చెప్పేసాను. హాస్పిటల్‌కి ఫీజ్ ఫుల్ రీయంబర్స్‌మెంట్ ఉంటుంది. బిల్స్ జాగ్రత్త చేసి, శివాజీని సబ్మిట్ చేయమని చెప్పండి అని చెప్పాడు. మీ అమ్మవాళ్ళకీ, మా అమ్మవాళ్ళకి కూడా చెప్పేసాను. సాయంత్రంలోగా వచ్చేస్తారందరూ." గలగలమాట్లాడుతూనే ఉంది సునీత.

పిచ్చి మొద్దు తనో, సునీతో అర్థం కాలేదు శివాజీకి.

***(మరో సరిగమ వచ్చేసంచికలో)***

Click here to share your comments on this story